సాక్షి తిరుపతి

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.58,170
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,196
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.67,600
రిటైల్ వెండి గ్రాము	రూ.69.60

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	33	17
తిరుమల	30	13
గూడూరు	33	19
నగరి	33	18



స్వర్ణ రథంపై కల్యాణ వెంకన్న

శ్రీనివాస మంగాపురం శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి వారు, ఉభయదేవేరులతో కలసి స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. – చంద్రగిరి

న్యూస్‌రీల్

నేడు పర్యావరణ విద్య పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం పర్యావరణ విద్య పరీక్షను నిర్వహించనున్నట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ) రమేష్ తెలిపారు. ఈ పరీక్షను ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షను 316 జూనియర్ కళాశాలల్లోని ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 48,549 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సర విద్యార్థులందరూ తప్పనిసరిగా ఈ పరీక్షకు హాజరవ్వాలని ఆర్ఐఓ కోరారు.

నేడు పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముక్కంటీశునికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. జ్ఞానప్రసూనాంబ అతిథిగృహం వద్ద ఉన్న శ్రీమణికంటేశ్వరస్వామి ఆలయం నుంచి ఊరేగిపుగా వెళ్లి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు.

బీసీ నేతలతో సిపాయి సమావేశం

– తదుపరి కార్యాచరణపై చర్చ



బీసీ నేతలతో సమావేశమైన సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి: టీడీపీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేసిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బీసీ నేతలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వన్నెకుల క్షత్రియ సామాజికవర్గం వారితో భేటీ అవుతున్నారు. తిరుపతి నగరంలోని తన కార్యాలయంలో గురువారం రేణిగుంట మండలానికి చెందిన కొందరు బీసీ నాయకులతో సమావేశమయ్యారు. టీడీపీ బీసీలకు చేసిన మోసాల గురించి ఆ సామాజికవర్గం వారంతా ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలను గౌరవించి, ప్రాధాన్యత ఉన్న పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

మహాశివరాత్రికి 429 ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: మహాశివరాత్రి నేపథ్యంలో ఈనెల 17, 18, 19 తేదీల్లో జిల్లాలో 429 బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తితోపాటు తలకోన, కైలాసకోన, సదాశివకోన, మూలకోన, గుడిమల్లం, అవంతికోన, పంట్రంగం, పిచ్చాటూరు, యాకసిరితిప్ప తదితర అన్ని శివాలయాలకు ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రావణబ్రహ్మపై నీలకంఠుడు



తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్)/శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరస్వామి రావణ వాహనం అధిరోహించి పురవీధుల్లో విహరించారు. ఆయన పక్కనే జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మయూర వాహనంపై సాగారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా ఉదయం హంసవాహనంపై వాయులింగేశ్వరుడు, యాళి వాహనంపై జ్ఞానప్రసూనాంబ ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం హంస, శుకవాహనసేవ, రాత్రి శేష, యాళివాహన సేవలు జరగనున్నాయి.

ఐదు వేల మందితో శివదీక్ష

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గురువారం ఐదువేల మందితో కలసి శివమాల ధరించి దీక్ష చేపట్టారు. శివరాత్రి ఉత్సవాలు ముగిసేవరకు ఈ దీక్ష కొనసాగిస్తారు. నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్యే ఒక్కరే ఈ మాల ధరించారు. ఎమ్మెల్యేని ఆదర్శంగా తీసుకుని అప్పట్లో 50 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మాల ధరించారు. రెండో ఏడాది 300 మంది, మూడో ఏడాది 2వేల మంది వరకు వేస్తే.. నాలుగో సంవత్సరం శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదువేల మంది శివమాల ధరించడం విశేషం. నాలుగేళ్ల క్రితం వరకు శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల ప్రజలు శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శివమాల ధరించినా వారంతా శ్రీశైలం వెళ్లి మొక్కు తీర్చుకునేవారు. నాలుగేళ్ల నుంచి శివమాల ధరించిన వారంతా శ్రీకాళహస్తిలోనే మొక్కులు చెల్లించుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మాల ధరించిన వారిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుటుంబీకులు కూడా ఉన్నారు.



భక్తులతో కలిసి శివమాల ధరించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు (ఇన్‌సెట్) శంఖం ఊదుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

స్పందన లేని నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ నేతలు తంటాలు పడుతున్నారు. డబ్బులిచ్చి ఇతర రాష్ట్రాల నుంచి జనాన్ని తీసుకొచ్చి దింపుతున్నారు. ఇదిచాలదన్నట్టు తమ నాయకుడి వద్ద మెప్పుపొందేందుకు కొత్త కుట్రలకు తెరలేపుతున్నారు. కార్యకర్తలను మభ్యపెట్టి పొలాలను సైతం దున్నించేస్తున్నారు. తద్వారా ప్రజల వద్ద సానుభూతితోపాటు తమ అధినేత వద్ద మంచి మార్కులు కొట్టేయాలని తీవ్రంగా ప్రత్నిస్తున్నారు. యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్రలో అనర్థాలు చోటు చేసుకుంటున్నా.. విధుల్లో ఉన్న అధికారులు, నేతల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా లెక్కచేయకుండా ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు భక్తుల ప్రాణాలతోనూ చెలగాటమాడేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. శివరాత్రి రోజే శ్రీకాళహస్తి పట్టణంలో రోడ్‌షో, సభలకు అనుమతివ్వాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీనిపై స్థానికులతోపాటు శివభక్తులు రగిలిపోతున్నారు. మొదలే ఇరుకు వీధులు.. ఆపై శివభక్తులు.. తొక్కిసలాటలు..తోపులాటల్లో ఎవరి ప్రాణాలు తీస్తారోనని ఆందోళన చెందుతున్నారు.

యమగళం!



రోటావేటర్‌తో దున్నేసిన వేరుశనగ పంట(ఇన్‌సెట్) రైతు మురళీకృష్ణారెడ్డి

- ప్రజలకు వణుకుపుట్టిస్తున్న లోకేష్ యువగళం పాదయాత్ర
- పాదయాత్రను హైలెట్ చేసుకునేందుకు నేతల తంటాలు
- బయటపడుతున్న నాయకులు, కార్యకర్తల కుట్ర కోణాలు
- తన పంట తానే ధ్వంసం చేసి వైఎస్సార్‌సీపీపై నెట్టే ప్రయత్నాలు
- ఇప్పుడు శివరాత్రికి వచ్చే భక్తుల ప్రాణాలతో చెలగాటమాడేలా నాటకాలు
- శివరాత్రి రోజే రోడ్‌షో, సభలకు అనుమతివ్వాలంటూ అధికారులపై ఒత్తిళ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న శివభక్తులు

సాక్షి, తిరుపతి: టీడీపీ కార్యకర్త నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర జిల్లాలో అంతంతమాత్రంగా సాగుతోంది. స్పందన నామమాత్రంగా ఉండడంతో ఒకింత ఆ పార్టీ నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకానొక దశలో పట్టుమని పది మంది కూడా రాకపోవడంతో నవ్వులపాలవుతోంది. దీంతో ఆ పార్టీ అగ్రనాయకులు చంద్రబాబుతోపాటు, లోకేష్ ఒకింత అసహనం వ్యక్తం చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే పాదయాత్రను ఎలాగైనా సక్సెస్ చేయాలని ఆ పార్టీ యంత్రాంగం అడ్డదారులు తొక్కుతోంది. దాన్ని తమకు అనుకూల మీడియా ద్వారా విస్తత ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది.

శివా.. ఈ కుట్రలు కనవా?

దక్షిణ కైలాసంగా వెలుగొందుతున్న శ్రీకాళహస్తిలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు 13 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నారు. ఈనెల 18 (శనివారం) మహాశివరాత్రి పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అదే రోజు సుమారు నాలుగు లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేపడుతున్నారు. బస్సులు, లారీలతోపాటు, ఇతర భారీ వాహనాలు పట్టణంలోకి రానీకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనికితోడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో పట్టణంలో ఎలాంటి రాజకీయ యాత్రలు, రోడ్‌షోలకు అనుమతి ఉండదు. అయినా టీడీపీ నేతలు శివరాత్రి రోజే నారా లోకేష్ పాదయాత్ర పట్టణంలో సాగే విధంగా రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. భక్తులు వెళ్లే మార్గమైన పొన్నాలమ్మ ఆలయం వద్ద బహిరంగ సభకు అనుమతివ్వాలంటూ అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. ఈ మేరకు మాజీ మంత్రి తొట్టంబేడు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.



ఆది నుంచీ అనర్థాలే

లోకేష్ పాదయాత్ర ప్రారంభం నుంచి అనర్థాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. తొలిరోజు తారకరత్న గుండెపోటుకు గురవ్వగా.. తర్వాత ఓ కానిస్టేబుల్ ఊపిరాడక మృతిచెందాడు. మరో కార్యకర్త త్రిశూలంపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. తదనంతరం వందల మంది కార్యకర్తలు స్వల్పగాయాల పాలవుతున్నారు. ఇలాంటి సందర్భంలో శివరాత్రి నాడే శ్రీకాళహస్తిలో రోడ్ షో నిర్వహించాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి గురువారం రాత్రి తొట్టబేడు పోలీస్‌స్టేషన్ ఎదుట నానాయాగి చేశారు. మొదలే అంతంతమాత్రంగా ఉన్న ఇరుకు వీధుల్లో రోడ్ షోలు, సభలు పెడితే భక్తుల పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇది రోగుల ప్రాణాలతో చెలగాటమాడడమేనని ఆందోళన చెందుతున్నారు.

అనుమతిస్తే ఇబ్బందులెన్నో

లోకేష్ పాదయాత్రకు అనుమతిస్తే సవాలక్ష సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. మొదలే పట్టణంలోని వీధులు అంతంతమాత్రం. ఎప్పుడో పురాతన కాలంలోని నాలుగు మాడ వీధుల్లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులే. దీనికితోడు మహాశివరాత్రి ఉత్సవాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహన సేవలు తిరగాల్సి ఉంటుంది. అదే సమయంలో పట్టణంలోకి కనీసం బస్సులను కూడా అనుమతించరు. ఆపసోపాలు పడి భక్తులు, ప్రయాణికులు, స్థానికులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో లోకేష్ పాదయాత్రకు అనుమతిస్తే మరిన్ని ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భక్తుల ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు.

పంటను దున్నేసి.. అసలు దొంగను పట్టేసి..

తొట్టంబేడు మండలం, చిట్టత్తూరు గ్రామానికి చెందిన మురళీకృష్ణారెడ్డి టీడీపీకి నమ్మినబంటు. ఇటీవల ఆయన తన ఆరు ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగుచేశాడు. ప్రస్తుతం ఆ పంట పూత, పిందె దశకు చేరింది. ఈ పంట మొత్తం దున్నేసి, దాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టాలని స్థానిక టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డితోపాటు, కొందరు నేతలు పథకం రచించారు. తద్వారా పాదయాత్రలో లోకేష్ ధ్వంసమైన పంటను పరిశీలించి అధికారపార్టీ నేతలతోపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టించాలని ప్రణాళిక రచించారు. ఇలా చేస్తే మండలంలో 'నువ్వే లీడర్‌వు' అంటూ సదరు రైతును నమ్మించారు. అనుకున్నదే తడువుగా గత గురువారం రాత్రి సదరు రైతు మురళీకృష్ణారెడ్డి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు స్థానికులను నమ్మించాడు. అదే రోజు రాత్రి రోటావేటర్‌తో తన వేరుశనగ పంటను ధ్వంసం చేశాడు. తర్వాత శుక్రవారం ఉదయం తన పంటను వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆనందరెడ్డి నాశనం చేశారంటూ గగ్గోలుపెట్టారు. ఇదే అదనుగా టీడీపీ నేతలంతా గ్రామంలో పర్యటించి హడావుడి చేశారు. వైఎస్సార్‌సీపీపై లేనిపోని విమర్శలు చేశారు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేసి విచారణ చేపట్టాలని కోరారు. ఈ నేపథ్యంలో పోలీసులు కాల్ డేటా ఆధారంగా పలువురిని ప్రశ్నించారు. అనంతరం సీసీ ఫుటేజీలు పరిశీలించి అసలు దొంగ మురళీకృష్ణారెడ్డేనని తేల్చారు. విచారణలో అతను చేసిన తప్పును ఒప్పుకుని పోలీసుల ఎదుట లొంగిపోయాడు. నిజం బయటపడడంతో టీడీపీ శ్రేణులు, ఎల్లో మీడియా తమకు అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం మొదలు పెట్టారు.

సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- సీఎం జగన్‌లా హామీలు అమలు చేసిన నాయకుడిని చూడలేదు
- ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించండి
- రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించాలి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు



పుంగనూరు: మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీలు రెడ్డెప్ప, రంగయ్య

పుంగనూరు: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మున్సిపాలిటీలో గృహసారథులు, కన్వీనర్ల సమావేశాన్ని ఎంపీలు రెడ్డెప్ప, తలారీ రంగయ్యతో కలసి నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ గృహసారథులకు పార్టీ విధివిధానాలను ప్రతి ఇంటికీ తెలియజేసే బాధ్యతను అప్పగించడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు చేసిన మోసాలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చిన హామీలను ప్రజలకు వివరించాలన్నారు. గృహసారథులు ఈనెల 18 నుంచి 26 వరకు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో పుంగనూరు నియోజకవర్గం ఆదర్శంగా ఉండేలా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ పంపిన కిట్లను మంత్రి పంపిణీ చేశారు. సమావేశంలో టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, రాష్ట్రజానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కన్వీనర్ వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా జీవితంలో ఇలాంటి నాయకుడిని చూడలేదు

పులిచెర్ల(కల్లూరు): 'నా రాజకీయ జీవితంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తరహాలో హామీలు అమలు చేసిన నాయకులను నేను ఎన్నడూ చూడలేదని' మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పులిచెర్లలో గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు మండల సచివాలయ కన్వీనరు ముర్వత్ బాషా అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. అందుకే ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించాలని సూచించారు. భవిష్యత్‌లో మరింత లబ్ధి చేకూరాలన్నా, రాష్ట్ర మరింత అభివృద్ధి చెందాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా రావాలన్నారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో మండలంలోని అయ్యావాండ్లపల్లె పంచాయతీ ఎర్రంవాండ్లపల్లె టీడీపీకి చెందిన ఆరు కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, జింకా చలపతి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్, వెంకటరెడ్డియాదవ్, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, వైస్ ఎంపీపీ ఈశ్వరి, సర్పంచ్ రాణెమ్మ పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

మొదలైన నామినేషన్ల పర్వం

- గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ నోటిఫికేషన్ జారీ
- ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ కూడా..
- తొలిరోజు టీచర్ ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్‌కు ఒక్కో నామినేషన్ దాఖలు



ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఆర్వో వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల (తూర్పు రాయలసీమ) ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు చిత్తూరు కలెక్టరేట్‌లో గురువారం గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారి జేసీ వెంకటేశ్వర్ విడుదల చేశారు. విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను కలెక్టరేట్‌లోని నోటీస్ బోర్డులో అతికించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ నామినేషన్ పత్రాలు అభ్యర్థిచేత గానీ అతను/ఆమె ప్రతిపాదకుని చేతనైనా ఈనెల 23వ తేదీలోపు (ప్రభుత్వ సెలవు రోజు కాకుండా) దాఖలు చేయవచ్చన్నారు. అభ్యర్థులు చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి (కలెక్టర్) చాంబర్ వద్ద లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (డీఆర్వో) వద్ద నామినేషన్ పత్రాలు అందజేయవచ్చని తెలిపారు. పోటీచేసే అభ్యర్థులు కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు పొందవచ్చన్నారు. ఈ నెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు నామినేషన్ పత్రాలను పరిశీలిస్తామని చెప్పారు. నామినేషన్ పత్రాల ఉపసంహరణ నోటీసును అభ్యర్థి, ప్రతిపాదకుడు రాతపూర్వకంగా ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయవచ్చన్నారు. అదేరోజు ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు

తొలిరోజు ఎమ్మెల్సీ నామినేషన్‌ల సందడి మొదలైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కలెక్టరేట్ వద్ద పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఐదుగురిని మాత్రమే లోనికి అనుమతించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించారు. తొలి రోజు రెండు నామినేషన్లు దాఖలుకాగా.. అందులో టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి చిత్తూరు నగరానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు స్వతంత్ర్య అభ్యర్థిగా శ్రీరామమూర్తి నామినేషన్ వేశారు. టీడీపీ బలపరిచిన నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన గ్రాడ్యుయేట్ అభ్యర్థి శ్రీకాంత్‌చౌదరి నామినేషన్ పత్రాలు ఆర్వోకు అందజేశారు.

ఎండోమెంట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



పరీక్ష నిర్వాహణపై సూచనలు చేస్తున్న డీఆర్వో శ్రీనివాసరావు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ ఎండోమెంట్ ఈవో గ్రేడ్–3 పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గురువారం తిరుపతి కలెక్టరేట్‌లో డీఆర్వో అధ్యక్షతన పరీక్షల నిర్వాహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ తిరుపతి నగరంలోని రామిరెడ్డిపల్లి వద్దగల ఇయాన్ డిజిటల్‌లో శుక్రవారం రెండు సెషన్లలో ఆన్‌లైన్ పద్ధతిలో ఎండోమెంట్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ప్రతి సెషన్స్‌లోను 180 మంది అభ్యర్థులు హాజరుకానున్నాని తెలిపారు. అభ్యర్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ప్రియాంక, ఏఈ ఎలక్ట్రిసిటీ నాగరాజు, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కుతూహలమ్మకు కన్నీటి నివాళి





కుతూహలమ్మ పార్థివ దేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

తిరుపతి మంగళం/గంగాధరనెల్లూరు : మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ కుతుహలమ్మ పార్థివదేహాన్ని సందర్శించి రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ నివాళులర్పించారు. కుతూహలమ్మ మృతి చెందిన విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి తెలుసుకుని గురువారం తిరుపతిలోని ఆమె ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. నిత్యం ప్రజాసేవే పరమావధిగా పని చేసిన కుతూహలమ్మ మృతి ఎంతో బాధాకరమన్నారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను మంత్రి పెద్దిరెడ్డి పరామర్శించి, కుటుంబానికి తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. లక్ష్మిరెడ్డిపల్లిలో ప్రభుత్వ లాంఛనాలతో కుతూహలమ్మ పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యేలు గాంధీ, లలితకుమారి, చిత్తూరు జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను నారాయణస్వామి ఓదార్చారు.

విద్యాభివృద్ధి అమోఘం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఢిల్లీ బృందం

పాకాల : ఏపీలో విద్యాభివృద్ధి అమోఘంగా ఉందని ఎన్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ బృందం సభ్యులు కొనియాడారు. ఈ మేరకు వారు గురువారం మండలంలోని అచ్చమ్మ అగ్రహారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర విషయాలపై ఆరాతీశారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సీఈఆర్టీ టీచర్ దివ్యసింగ్, పంకజ్ ఉత్రేజా మాట్లాడుతూ నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారాయని, ఇక్కడ పరిశీలించిన విషయాలు ఢిల్లీలోని పాఠశాలల్లో అమలు చేస్తామని చెప్పారు. ఎంఈఓ బాబ్జీ, సమగ్రశిక్ష సీఎంఓ సురేష్, ఢిల్లీ టీం అనురాధ, భావన, పాఠశాల హెచ్ఎం జార్జ్, సీఆర్పీ జ్యోతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా : స్విమ్స్ వైరాలజీ విభాగంలో తాత్కాలిక ప్రతిపాదికన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీధర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు స్విమ్స్ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని, దరఖాస్తును పూర్తిచేసి జెరాక్స్ కాపీలను జతచేసి నేరుగా కానీ, స్పీడ్ పోస్టు ద్వారా అందజేయవచ్చునని ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్, క్లినికల్ వైరాలజీ విభాగం, స్విమ్స్ వర్సిటీ తిరుపతి– 517501 చిరునామాకు పంపించాలని ఆయన కోరారు. ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తులు చేరాలన్నారు. మార్చి7న మెరిట్ లిస్ట్ ప్రకటన, 15న ఇంటర్వ్యూలు ఉంటాయని ప్రకటనలో తెలియజేశారు.

మహిళా, శిశు సంక్షేమానికి పెద్దపీట

తిరుపతి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశుసంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఆ శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ సిరి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం, పద్మావతిపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ప్రీస్కూల్ చిన్నారులతో ముచ్చటించారు. టీచర్‌గా మారి వారికి పాఠాలు చెప్పారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న వైఎస్సార్ కిట్స్, బాలామృతం, బియ్యం, కోడిగుడ్లు, పప్పు, ఆయిల్ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరి మాట్లాడుతూ గర్భిణులు, తల్లులు, శిశువుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రక్తహీనతను అరికట్టేందుకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మొత్తం 266 మంది చిన్నారులు ఉంటే వారిలో 42 మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు ఆరోగ్య రికార్డుల ద్వారా గుర్తించారు. వారి ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులకు సైతం అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, రోజారమణి, అన్నపూర్ణ, నరసింహమూర్తి, సీడీపీఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పాఠాలు చెబుతున్న స్త్రీ.శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ సిరి

ఢిల్లీలో టీటీడీ శిల్పకళాశాల విద్యార్థుల ఎగ్జిబిషన్

తిరుపతి అలిపిరి: టీటీడీ శిల్పకళాశాల విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రపంచానికి తెలియజేయడం కోసం ఢిల్లీలోని ఆర్ట్ గ్యాలరీలో ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేయిస్తామని జేఈఓ సదాభార్గవి చెప్పారు. కలంకారి కళను రాష్ట్ర కళగా ప్రకటించేందుకు ప్రభుత్వాన్ని కోరే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎస్వీ శిల్ప కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిల్పకళా ప్రదర్శన, విక్రయాల ముగింపు కార్యక్రమానికి గురువారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎగ్జిబిషన్ ద్వారా కళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసుకునే అవకాశం కూడా లభిస్తుందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో 6,503 మంది పాల్గొన్నారని తెలిపారు. దీనికి కొనసాగింపుగా ఆగస్టులో వర్క్ షాప్, నవంబర్‌లో మరో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శిల్పకళాశాల విద్యార్థులకు ఇంగ్లిష్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు, 3డీ కంప్యూటర్‌లో కూడా శిక్షణ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారి కోసం సాయంత్రం కోర్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం డీఈఓ భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డి ప్రసంగించారు. కళాకారులు మునిరత్నం, గాయత్రీదేవి, లావణ్య, మునస్వామి, కళాశాల తొలి బ్యాచ్ విద్యార్థి అమరలింగాచారిని జేఈఓ శాలువతో సత్కరించారు.



మాట్లాడుతున్న జేఈఓ సదాభార్గవి

న్యాయమూర్తుల బదిలీలు, నియామకాలు

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి జూనియర్ సివిల్ జడ్జిలను ఇతర ప్రాంతాలకు బదిలీచేస్తూ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే 2021లో జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన అభ్యర్థులను జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిలుగా నియమిస్తూ ఉత్తర్వుల్లో తెలిపింది. ఆమేరకు తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న సీహెచ్ పవన్‌కుమార్‌ను విశాఖపట్నం రెండవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా, శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న కె.నరేంద్రరెడ్డిని గుంటూరు జిల్లా చిలకలూరు పేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేసింది. చిత్తూరు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన షేక్‌బాబాజాన్‌ను, శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నెల్లూరు చంద్రమౌళినగర్‌కు చెందిన జె.కృష్ణప్రియను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బదిలీ కావడంతో ఆ కోర్టుకు ఇన్‌చార్జి న్యాయమూర్తిగా స్థానిక ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరితను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. బదిలీపై వెళుతున్న, నూతనంగా వస్తున్న జూనియర్ సివిల్ జడ్జిలు మార్చి ఒకటవ తేదీలోపు ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని పేర్కొంది.

ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు

ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఇద్దరు న్యాయవాదులు, ఒక కోర్టు ఉద్యోగి కొత్తగా జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపిక కావడం విశేషం. తిరుపతి ఆర్‌సీ రోడ్డుకు చెంది న్యాయవాదులు పి.జయచంద్ర, పి.సుమతి కుమారుడు పీజే తేజసాయి, శ్రీకాళహస్తి కొత్తపేట గాండ్ల వీధికి చెందిన పాలమంగళం వినోద్ అలాగే చిత్తూరు జిల్లా అడవిపల్లికి చెందిన కోర్టు ఉద్యోగి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికయ్యారు. న్యాయవాది తేజసాయిని కర్నూలు జిల్లా ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జిగా, పాలమంగళం వినోద్‌ను నెల్లూరు ప్రత్యేక రైల్వేకోర్టు జడ్జిగా, ఎం.చంద్రశేఖర్‌రెడ్డిని అనంతపురం జిల్లా తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్ఐ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న నోడల్ అధికారి



అధికారులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి జగదీష్

తిరుపతి క్రైం: ఏపీఎస్ఎల్పీఆర్బీ ఎస్ఐ ప్రాథమిక పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని నోడల్ అధికారి జగదీష్ ఆదేశించారు. నగరంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ జరగనున్న పోలీస్‌శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం ఏడు గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకొని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. అభ్యర్థులతో పాటు విధులు నిర్వహించే సిబ్బందిని, ఇన్విజిలేటర్లను కూడా తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి భద్రతపై ఆరాతీశారు. సమావేశంలో ఏఎస్పీలు రాజేంద్ర, వెంకటరావు, మునిరామయ్య, డీఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న విష్ణువర్ధన్

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద బుధవారం రాత్రి పెళ్లూరు విష్ణువర్ధన్(35) అనే వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, ఆత్మకూరు పట్టణం నారాయణరావుపేట ప్రాంతానికి చెందిన విష్ణువర్ధన్ వరికోత యంత్రం ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజులుగా ఈప్రాంతంలో పనులు చేసుకుంటున్నాడు. కుటుంబ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విష్ణువర్ధన్ మనస్థాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. ఎస్ఐ కృష్ణారెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య భవాని, కుమారులు వెంకటసాయికార్తిక్, కుందన్‌కుమార్ ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గూడూరు: గూడూరు రైల్వే జంక్షన్ సమీపంలోని రైల్వే పార్శిల్ కార్యాలయ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గురువారం గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 55 ఏళ్లు ఉండవచ్చని, గులాబీ రంగు చొక్కా, నీలి రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద ఎలాంటి వివరాలు లేవని, మృతదేహాన్ని బట్టి మృతి చెంది రెండు రోజులై ఉండవచ్చని భావిస్తున్నామన్నారు.

రిజర్వాయర్ల పరిశీలన

రేణిగుంట: కరకంబాడి సమీపంలోని తారకరామానగర్‌లో ఉన్న గాలేరు– నగరి సుజల శ్రవంతి శిలాఫలకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పరిశీలించారు. గురువారం ఆయన తొలుత రేణిగుంట నుంచి ర్యాలీగా తరలివచ్చి మల్లిముడుగు, బాలాజీ రిజర్వాయర్లను పరిశీలించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. ఈనెల 13 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ పరిశీలించనున్నట్లు వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథరెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా హరిజవహర్‌లాల్

- తిరుమల ఆలయంలో ప్రమాణస్వీకారం



హరి జవహర్‌లాల్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా రెవెన్యూ, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ(ఎఫ్ఏసీ) డా.ఎం.హరిజవహర్‌లాల్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆయనతో ప్రమాణం చేయించారు. దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. జేఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో కస్తూరి బాయి, వీజీవో బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి నంది వాహనం వితరణ



నంది వాహనాన్ని బహూకరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- భక్తుల కోసం రూ.1.8 లక్షల విలువ చేసే వాహనం అందజేత
- క్యాన్సర్ బాధితునికి రూ.50 వేల ఆర్థిక సాయం
- దాతృత్వం చాటుకుంటున్న మంత్రి రోజా

నగరి : పట్టణ పరిధిలోని కరకంతేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా నందివాహనాన్ని వితరణగా అందించారు. గురువారం ఆలయానికి విచ్చేసిన ఆమె రూ.1.80 లక్షల విలువ గల నందివాహనాన్ని ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా నందివాహనానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో మంత్రి నందివాహనానికి పూజలు చేశారు. అర్చకులు ఆమెను పుష్పాలతో ఆశీర్వదించారు. ఆలయంలో జరిగే నందిసేవలో భక్తులు పాల్గొనే భాగ్యం కలుగుతుందని ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. ఆలయ కమిటీ తరపున మంత్రి రోజాను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ ఢిల్లీ, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, కౌన్సిలర్లు దయానిధి, బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, అమర్, నాయకులు బాబురెడ్డి, తేన్‌మొళి, శశికళ, వెంకటేశ్, శ్రీనివాసులు, ప్రకాష్, సలీం, శీన తదితరులు పాల్గొన్నారు.



బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి రోజా

క్యాన్సర్ బాధితునికి రూ.50 వేలు ఆర్థిక సాయం

నగరి : పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి ఎటువంటి ఆపద వచ్చినా వెన్నంటే ఉంటానని మంత్రి ఆర్‌కే రోజా హామీ ఇచ్చారు. గురువారం ఆమె క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వడమాలపేట మండల దాసరి వీధికి చెందిన తులసికి మంత్రి ఆర్‌కే రోజా రూ.50 వేలు ఆర్థికసాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. తులసి అనా రోగ్యం విషయాన్ని వడమాలపేట మండల సోషల్ మీడియా కన్వీనర్ జగదీష్, మంత్రి సోదరుడు రాంప్రసాద్ రెడ్డికి, మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె బాధితునికి నగరిలోని తన కార్యాలంలో రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.50 వేలు అందజేశారు. టాటా క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.